1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | సెప్టెంబర్ 21, 2024 | www.navatelangana.com

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలి

- మండల నోడల్ అధికారి నాగయ్య

నవతెలంగాణ-బోధన్


మాట్లాడుతున్న నోడల్ అధికారి నాగయ్య

నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని బోధన్ మండల నోడల్ అధికారి నాగయ్య అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఉప విద్యాధికారి కార్యాలయంలో బోధన్ ఉమ్మడి మండల ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్)పై రివ్యూ నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో జరిగే నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే మాదిరి పాఠ్య బోధనపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఆరిపోద్దిన్, రిసోర్స్ పర్సన్ రాకేష్, శ్రీదేవీ, హనుమాండ్లు, సిఆర్పిలు విజయ్, బాబు, షఫీ పాల్గొన్నారు.

వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

నవతెలంగాణ-సదాశివనగర్


వర్షానికి కొట్టుకుపోయిన ప్రమాదకరంగా మారిన రోడ్డు

మండలంలోని ఉత్నూర్ గ్రామ సమీపంలో వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. ఈ రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనదారులు జంకుతున్నారు. రాత్రి పూట భారీ వాహనాలు ఎదురుగా వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉంది. ఈ రహదారి వెంబడి గాంధారి మండలంతో పాటు నిజామాబాద్ జిల్లాకు, యాచారం, బూర్గుల, మంచిప్ప తదితర చుట్టుపక్కల గ్రామాలకు వివిధ పనుల నిమిత్తం వస్తూ పోతుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

నూతన నేర న్యాయ చట్టాలపై
అవగాహన కలిగి ఉండాలి

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుంచి తీసుకువచ్చిన నూతన నేర న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలియజేశారు. శుక్రవారం నిజామాబాద్ శివారులోని బోర్గం బ్రిడ్జి వద్ద గల భూమారెడ్డి కన్వెన్షన్ మినీ ఫంక్షన్‌హాల్‌లో నూతన నేరన్యాయ చట్టాలపై మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. జులై 1వ తేదీ నుంచి భారత ప్రభుత్వ నూతన నేర న్యాయ చట్టాలు-2023 అమలులోకి వచ్చిన తరుణంలో పలు కేసుల దర్యాప్తు విచారణలో పాటిస్తున్న నూతన విధానాలపై మీడియా మిత్రులకు అవగాహన కల్పించేందుకు, భారతీయ న్యాయ సన్నిహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలకు సంబంధించిన పలు చట్టాల న్యాయ శాస్త్ర గ్రంథాలలో గల ప్రతీ అంశాల గురించి క్షుణ్ణంగా తెలియజేశారు. ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్), సీఆర్పీసీ చట్టాన్ని భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), అదేవిధంగా ఎవిడెన్స్ యాక్ట్‌ను భారతీయ సాక్ష్య అధినియమం చట్టాలుగా మార్పు చేశారన్నారు. ఐపీసీలో 511 చట్టాలు ఉంటే వాటిని బీఎన్ఎస్‌లో 358కి తగ్గించారని చెప్పారు. అదేవిధంగా సీఆర్పీసీలో 484 వరకూ ఉంటే వాటిని బీఎన్ఎస్ఎస్‌లో 531కి పెంచారని, అలాగే ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 167 చట్టాలు ఉంటే వాటిని బీఎస్ఎలో 170కి పెంచారన్నారు. కేంద్రప్రభుత్వం అందరికీ అవసరమైన, ఆమోదయోగ్యమైన చట్టాలను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం పూర్తిగా పవర్ పాయింటు ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులకు గల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అదనపు డి.సి.పి (అడ్మిన్) కోటేశ్వరరావ్, అదనపు డి.సి.పి (ఎ.ఆర్) శంకర్ నాయక్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, స్పెషల్ బ్రాంచ్, ఎ.ఆర్, ట్రాఫిక్, సి.సి.ఆర్.బి ఎ.సి.పిలు రాజావెంకట్రెడ్డి, బస్వారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, నాగయ్య, నారాయణ, రవీంధర్‌రెడ్డి, సిఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను
ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్


ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

ఆరోగ్యశ్రీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలపైన ధర్నా చౌక్ వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం వేతనాలను అమలు చేయాలని తెలియజేశారు. రాబోయే పిఆర్‌సిలో కనీస వేతనం రూ.35000లతో పాటు టిఏ, డీఏలు కల్పించాలన్నారు.

గత 17 సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ పథకంలో విధులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఆరోగ్య మిత్రలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని తెలిపారు. గత 17 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్న ఆరోగ్య మిత్రలకు కనీస వేతనాలు లేకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంపు చేసిందని, అయినా ఆరోగ్య మిత్రలను మాత్రం విస్మరించిందని విమర్శించారు. పేద ప్రజలకు సేవలు అందించే ఆరోగ్య మిత్రలు చనిపోతే కనీసం ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేకపోవడం దౌర్భాగ్యకరమైన విషయం అన్నారు. హెల్త్ స్కీములో పనిచేసే వారికి హెల్త్ కార్డు లేకపోవడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కనీస వేతనాన్ని 26 వేలకు పెంచి పీఆర్సీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రాలకు డీపీఓ (డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్) క్యాడర్ హోదా కల్పించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామాగౌడ్, శ్రావణ్, విజయ, అంబికా, సుమలత, వీరయ్య, టి.రాములు, సుమలత, అఖిల తదితరులు పాల్గొన్నారు.

సన్న ధాన్యం విక్రయించే రైతులకు బోనస్

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్


మాట్లాడుతున్న కలెక్టర్ అశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

సన్న ధాన్యం విక్రయించే రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తోందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై శుక్రవారం కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐకెపి ఆధ్వర్యంలో 23, సహకార సంఘాల ఆధ్వర్యంలో 328 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ రెండో వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు. ముందస్తుగా అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని పేర్కొన్నారు. జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2203, సాధారణ కామన్ గ్రేడ్‌కు క్వింటాల్‌కు ధర రూ.2183 చెల్లించనున్నట్లు తెలిపారు. గన్నీ సంచులు, ప్యాడి క్లీనర్స్, టార్పాలిన్లు సిద్ధం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి, టెంటు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్డిఓ సురేందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, సివిల్ సప్లై మేనేజర్ రాజేందర్, సహాయ సివిల్ సప్లై అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డిసిఓ రామ్మోహన్, ఎల్డిఎం రవికాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో విశిష్ట సేవలు అందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు పురస్కారాలకై దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో వయోవృద్ధులు ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థలు జిల్లాలో విశిష్ట సేవలందిస్తే వారు తమ సేవల గురించి రాష్ట్ర వయోవృద్ధుల శాఖ కార్యాలయానికి పురస్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని వయోవృద్ధుల శాఖ జిల్లా అధికారి భావయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విశిష్ట సేవలు అదిస్తున్న వయోవృద్ధులకు, వారి ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థలకు అక్టోబర్ ఒకటవ తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవ పురస్కారాలను అందిస్తున్నట్లు రాష్ట్ర వయోవృద్ధుల శాఖ సంచాలకురాలు తెలిపారని, దీనికి అర్హులైన వారు సెప్టెంబర్ 25 సాయంత్రం 5లోపు హైదరాబాదులో మలక్పేట్‌లోని నల్గొండ క్రాస్‌రోడ్ బస్‌స్టాప్ పక్కన ఉన్న దివ్యాంగుల సంక్షేమ భవన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ ఫారం, పురస్కారాల కేటగిరీ కొరకు పర్వత, ఇతర వివరాలకై www.wdsc.telangana.gov.in డిపార్ట్మెంట్ వెబ్సైట్లో చూడాలని జిల్లా సంక్షేమ అధికారి బావయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గౌరారం అడవిని కాపాడండి సార్

- కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి


మాట్లాడుతున్న గ్రామస్తులు

మండలంలోని గౌరారం గ్రామస్తులు తమ గ్రామ శివారులోని అటవీ భూమిని కాపాడాలని మండల డివిజన్ జిల్లాస్థాయి అధికారులకు ఎన్నిసార్లు వినిపించినా పట్టించుకోకపోవడంతో గౌరారం గ్రామస్తులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. 'మా గ్రామ పరిధిలోని అటవీ భూ సరిహద్దు పరిరక్షణ కొరకు 10-09-2024 ఏకగ్రీవ తీర్మానం చేశాం. ఆక్రమణకు గురైన అటవీ భూమి వెంకటాపూర్ గ్రామా నివాసి భాద్య నాయక్ అనే వ్యక్తి సుమారు 50 ఎకరాల భూమిని ఆక్రమణగా సాగుచేస్తున్నాడు. సాగు చేయడమే కాకుండా ఆ భూమిలో కొన్ని రోజులు ముందు బోరు వేసుకొని ట్రాన్స్‌ఫార్మర్ బిగించుకున్నారు. చుట్టూ కంచే వేయించుకున్నాడు. ఈ విషయమై తాము చాలా రోజుల క్రితమే ఎఫ్ఆర్‌వోలకు ఫిర్యాదు చేశాం. అలాగే డిఎఫ్‌వో కామారెడ్డిని కూడా కలిసి విన్నవించాం. అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కావున మీరు తగు చర్యలు తీసుకొని ఆ భూమికి బౌండరీని ఏర్పాటు చేసి మా గ్రామ అటవీ భూమిని రక్షించాలి.' అని గ్రామస్తులు వినిపత్రంలో పేర్కొన్నారు.

ఫోక్సో బాధితురాలి కిడ్నాప్..?

- అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపైనే అనుమానం
- స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్‌స్టాండ్ సమీపంలో మైనర్ బాలిక కిడ్నాప్‌నకు గురైంది. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. బాలికపై గతంలో లైంగికదాడికి పాల్పడిన యువకుడే ఆమెను కిడ్నాప్ చేసి ఉంటాడని తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు. నిజామాబాద్ ఆరవ టౌన్ ప్రాంతానికి చెందిన మైనర్‌ను ఓ యువకుడు ప్రేమించానని, పెండ్లి చేసుకుంటానని బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు 6వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదైంది. కేసు నమోదైన నాటి నుంచి అ యువకుడు పరారీలో ఉన్నాడు. ఇటీవల కాలంలో యువకుడు కేసు వాపసు తీసుకోవాలని, పెండ్లి చేసుకుంటామని ప్రతిపాదనలు తెచ్చాడు. కానీ కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. గురువారం మైనర్ బాలిక తన సోదరి డెలివరీ కోసం ఖలీల్‌వాడీలో ఆసుపత్రికి రాగా.. అక్కడి నుంచి ఆమె కనిపించకుండా పోయింది. ఉదయం వరకు గాలించినా బాలిక కుటుంబ సభ్యులు ఈ మేరకు స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పీహెచ్‌సీలలో ఫ్రిజ్‌లు
అందుబాటులో ఉంచాలి

- డీఎంహెచ్‌ఓకు కలెక్టర్ ఆదేశాలు
- విధులకు గైర్హాజరు అయిన వైద్య సిబ్బందికి మెమోలు
- ఇందల్వాయి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మాట్లాడుతున్న కలెక్టర్

ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. ల్యాబ్‌లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని గమనించి, టెక్నీషియన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపి, ఇన్ పేషంట్ వార్డులను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, పలు లోపాలను గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతి, సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజర్ అయిన సిబ్బందికి మెమోలు జారీ చేయాలని తన వెంట ఉన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. ఔషధాలను శీతలీకరణలో ఉంచేందుకు ఉపయోగించే ఫ్రిజ్‌లను వినియోగించకుండా వృథాగా మూలన పడేయడాన్ని గమనించిన కలెక్టర్ పీహెచ్‌సీ అధికారులను నిలదీశారు. ఒకవేళ ఫ్రిజ్‌లు చెడిపోతే తక్షణమే వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో ఫ్రిడ్జ్ లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. పీహెచ్‌సీల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న రోగులకు కచ్చితంగా రక్తపరీక్షలు చేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ ఆరోగ్య సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించి ప్రతి ఒక్క ఆశా కార్యకర్తతో డెంగ్యూ కేసు చుట్టూ 50 ఇండ్లలో సర్వే చేయించాలని, స్ప్రే చేయించాలని సిబ్బందిని ఆదేశించారు.ప్రతి సోమ, మంగళవారం అమ్మ ఒడి కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలు అందించాలని వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ కు తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణాలలో నాణ్యమైన మందులను విక్రయించాలి


మాట్లాడుతున్న ఏడీఏ అలీ

నవతెలంగాణ-బోధన్

ఫర్టిలైజర్ దుకాణాలలో వ్యాపారులు నాణ్యమైన పురుగు మందులు విక్రయించాలని ఏడీఏ అలీ అన్నారు. శుక్రవారం బోధన్ ఏఎంసీ దగ్గర గల రైతు వేదికలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాలమేరకు బోధన్ నియోజకవర్గ ఫర్టిలైజర్ వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫర్టిలైజర్ డీలర్లు ప్రిన్సిపాల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అలాగే నాణ్యమైన మందులను మాత్రమే విక్రయించాలని, పురుగుకు సంబంధించిన మందులను మాత్రమే రైతులకు ఇవ్వాలని, ఇతర మందులను బలవంతంగా అంటగట్టవద్దని అన్నారు. రిథమ్ దోమ పోటు, బాక్టీరియా, లీఫ్ తెగుళ్లకు సరియైన మందులు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో బోధన్, ఎడపల్లి, నవీపేట్, రెంజల్ మండలాల వ్యవసాయ అధికారులు సంతోష్, లక్ష్మికాంత్‌రెడ్డి, సిద్ధి రమేశ్వర్, నవీన్‌తో పాటు ఆయా మండలాల ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రమాదాలకు గురవుతున్నా.. పట్టించుకోరా..?

- గుంతలమయంగా బీబీపేట్-ఇస్సానగర్ రోడ్డు

నవతెలంగాణ-బీబీపేట్


గుంతల మయమైన రోడ్డు

మండల కేంద్రం నుండి ఇస్సానగర్ మీదుగా వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు వర్షాల కారణంగా పూర్తిగా గుంతలమయమైంది. దాంతో వాహనదారులకు ప్రమాదాలు తప్పడం లేదు. ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు ప్రయాణించి వందల సంఖ్యలో ప్రమాదాలకు గురైన వారున్నారు.

ఇదిలా ఉండగా గత వేసవి కాలంలో ఇలాయి తూము వద్ద పంటలకు నీరు అందించడానికి సమస్య తలెత్తడంతో ఆ తూము వద్ద మరమ్మతులు కొనసాగించే క్రమంలో కొంతవరకు రోడ్డు ధ్వంసం అయింది. ఆ ప్రదేశంలో ప్రమాదాలను జరుగుతున్న స్థలంగా గుర్తించి కేవలం సూచిక బోర్డులు కూడా పెట్టకుండా వదిలేశారు. ఇక బీబీపేట పెద్ద చెరువు రోడ్డుపైకి ఎక్కువ స్థలంలో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ప్రయాణికులు అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ జిల్లా స్థాయి అధికారికి చరవాణి ద్వారా సమాచారాన్ని అందజేసినా పట్టనట్టుగా వ్యవహరించడం విడ్డూరమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

28న జాతీయ మెగా లోక్ అదాలత్

- సద్వినియోగం చేసుకోవాలి
- కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి



ఈ నెల 28న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ శుక్రవారం తెలిపారు. రాజీ పడదగిన కేసులలో జిల్లాలోని అని కోర్టులో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసుల్, రోడ్డు ప్రమాదాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీమార్గం రాజమార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని పేర్కొన్నారు. కోర్టులు, న్యాయస్థానాలు ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు, పోలీస్ సిబ్బందికి రాజీపడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విధంగా మెగా లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల వారు రాజీపడి ఇకనుంచి మనస్పర్థలు లేకుండా ఉండవచ్చునని తెలిపారు. కావున ఎక్కువ మొత్తంలో ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

రైస్‌మిల్ తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్


రైస్‌మిల్‌ను తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ గ్రామ శివారులో ఉన్న విజయ గణపతి రైస్‌మిల్‌లో శుక్రవారం హైదరాబాద్ నుండి వచ్చిన టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్‌లోని రికార్డులు, ధాన్యం బస్తాలను పరిశీలించారు. కమిషనర్ కార్యాలయం నుండి వచ్చిన సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రికార్డులలో అవకతవకలకు పాల్పడితే రైస్‌మిల్లుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డి శ్రీధర్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ టీం సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసరావు, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

పెచ్చులూడి కాంట్రాక్ట్ ఉద్యోగికి గాయాలు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- అధికారుల పర్యవేక్షణ కరువు

నవతెలంగాణ-కామారెడ్డి


పెచ్చు పడటంతో ఉద్యోగి తలకు గాయాలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. సబ్ స్టేషన్ ఎస్ఎస్1లో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసే సెంటర్లో కాంట్రాక్టు కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్ శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆఫీస్ గదిలోకి వెళ్లడంతో పెచ్చులూడి తలపై పడి రక్తస్రావం జరిగింది. సబ్‌స్టేషన్‌ను పరిశీలించవలసిన సంబంధిత అధికారులు వారి నిర్లక్ష్యం వలన ఈ ప్రమాదం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు.

సెలూన్ షాప్‌కు వెళ్లిన బాలుడు అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో సెలూన్‌కు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌ఓ విజయ్ బాబు శుక్రవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జబీర్(15) సెలూన్ షాప్‌లో పనిచేయడానికి ఇటీవల నగరానికి వచ్చాడు. నగరంలోని మాలపల్లి డీడీ సెలూన్ షాప్‌లో పనిచేయడానికి ఈ నెల 13న వెళ్లిన జబీర్ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి వివరాల్లో ఎవరికైనా తెలిస్తే 8712659837 నంబర్‌కు లేదా ఒకటవ పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలన్నారు.


జబీర్ (ఫైల్)

కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తా

- నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వినయ్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కుల సంఘాల అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఖానాపూర్ గ్రామంలో గ్రామంలో శుక్రవారం ఫంక్షన్ హాల్, కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారని గ్రామ మాజీ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు వినయ్‌రెడ్డి

నూతనంగా వచ్చిన తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండల తహసిల్దార్ ఎం.రమేష్ ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామచంద్రపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గున్నం గంగారం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటకం భూపతి, విలేజ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సఖి ప్రభాకర్, కటకంభరత్, రమేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రెండురోజుల జైలుశిక్ష

- డయల్ యువర్ 100 దుర్వినియోగం చేసిన వ్యక్తికి..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం అందిస్తున్న డయల్ 100 సేవలను దుర్వినియోగం చేసిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇందల్ వాయి ఎస్‌హెచ్‌ఓ బి. మనోజ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొహమ్మద్ బాబా అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, నిజామాబాద్ కోర్టు లో ప్రవేశ పెట్టారు. రెండవ క్లాసు మెజిస్ట్రేట్ డయల్ 100 సేవలను దుర్వినియోగం చేసిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.

ప్రముఖులకు నేడు అవార్డుల ప్రదానం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం 'స్టూడెంట్స్ మోటివేషన్' కార్యక్రమంతో పాటు నలుగురు ప్రముఖులకు 'శ్రీకారం విశిష్ట సేవా పురస్కారం' అవార్డులను ప్రదానం చేయనున్నట్లు 1986-87 బ్యాచ్‌కు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ సేవ, వైద్య వృత్తిలో విశిష్ట సేవల దృష్ట్యా ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక పాఠశాల విద్యార్థులకు, యువతి, యువకులకు 'స్టూడెంట్స్ మోటివేషన్' తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

రహదారిపై వరి ధాన్యం ఆరబెట్టొద్దు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టకూడదని ఎస్సై విక్రం రైతులకు సూచించారు. రహదారులపై వరి ధాన్యం మొక్కలు ఆరబెట్టడం ద్వారా ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. వాటివల్ల ప్రమాదంలో జరిగే అవకాశం అధికంగా ఉండడం ద్వారా ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టకూడదని రైతులకు సూచించారు. రహదారులపై ఆరబెట్టడం ద్వారా ప్రమాదాల జరిగితే సంబంధిత రైతులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని రైతులు తమకు సహకరించాలని అన్నారు.

బై బ్యాక్ ఒప్పందం ప్రకారం విత్తనాలను రైతులకు విక్రయించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-ఆర్మూర్

బై బ్యాక్ ఒప్పందం ప్రకారం విత్తనాలను రైతులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిజామాబాద్ రూరల్ ,భీంగల్ ,ఆర్మూర్ డివిజన్ లోని ఎర్ర జొన్న పంటపై విత్తన డీలర్లకు, రైతులకు, అధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా విత్తనాలను అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాలలో కూడా విత్తనాలను అమ్మితే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడిఏ విజయలక్ష్మి, భీంగల్, నిజామాబాద్ రూరల్ ఏ డి ఏ శ్రీనివాస్, ప్రదీప్, ఏసీపీ బస్వారెడ్డి, ఏవో హరికృష్ణ, సీడ్ లైసెన్స్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజన ఉత్సవాలకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 28వ జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా 2024-25 సంవత్సరానికి గాను జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ఈనెల 27న జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్, తిలక్ గార్డెన్లో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుండి 29 సంవత్సరాల లోపు ఉన్న యువ కళాకారులను ప్రోత్సహించేందుకు, వారికి జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు తగిన అవకాశం కల్పించడంలో భాగంగా ఈ జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి యువజన ఉత్సవాలలో సామూహిక, వ్యక్తిగత ప్రదర్శనలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి పొందిన వారిని రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలలో పాల్గొనేందుకు పంపిస్తారని తెలిపారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాలలో కళా రంగాల విభాగంలో జానపద నృత్య (సామూహిక బృందం) ఒక్కొక్క బృందంలో 10 మంది సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. జానపద నృత్యాలు భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలని, 15 నిమిషాలలో పూర్తి చేయాల్సింది ఉంటుందని పేర్కొన్నారు. దీనిలో క్యాసెట్, సిడి, పెన్ డ్రైవ్ ఉపయోగించొద్దని లైవ్ సాంగ్ మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. జానపద నృత్యం (వ్యక్తిగత /సోలో) ఒక్కొక్క బృందంలో ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని, జానపద గేయాలు ఒక్కొక్క బృందంలో 10 మంది వరకు అనుమతి ఉంటుం దని పేర్కొన్నారు. సినిమా పాటలు అనుమతించబడవని తెలిపారు. జానపద గేయాలు (వ్యక్తిగత/సోలో) : జానపద గేయాన్ని ఏ ప్రాంతీయ భాషలో అయినా భారతీయ పాటల నుండి తీసుకోవాలని బృందంలో ఐదుగురు సభ్యులకు అనుమతి ఉంటుందని తెలిపారు.

సైన్స్ మేళ : సైన్స్ అండ్ టెక్నాలజీ నేపథ్యంలో నూతన ఆవిష్కరణలతో సైన్స్ మేళను నిర్వహిస్తున్నారని ఆసక్తి ఉన్నవారు నూతన ఆవిష్కరణలతో సైన్స్ మేళాలో పాల్గొనాలని పేర్కొన్నారు. 26న మాణిక్ భవన్ పాఠశాలలో సైన్స్ మేళ నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనేవారు 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ (9848219365) సంప్రదించాలని పేర్కొన్నారు.

లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్‌లో భాగంగా నిర్వహించే కథ రచనలో పాల్గొనే అభ్యర్థులు ఎంపిక చేసిన అంశాన్ని ఇంగ్లీషులో 60 నిమిషాలు రాయాల్సి ఉంటుందని, 1000 పదాల కంటే ఎక్కువ ఉండకూడదని తెలిపారు. కవిత్వంలో ఎంపిక చేసిన అంశాన్ని ఇంగ్లీషులో 60 నిమిషాలలో రాయాల్సి ఉంటుందని, 500 కంటే ఎక్కువ మించకూడదని పేర్కొన్నారు. పెయింటింగ్‌లో పోస్టర్‌లో 20 లేదా 30 పదాలలో క్యాప్షన్ పేర్కొనాల్సి ఉంటుందని, పోస్టర్ తయారీ 90 నిమిషాలలో రాయాలని తెలిపారు. వకృత పోటీలో పాల్గొనేవారు ఎంచుకున్న అంశంపై ఇంగ్లీష్ లేదా హిందీ భాషలో మూడు నిమిషాలలో ప్రసంగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యువకృతిలో ప్రతి కేటగిరికి హస్త కళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు కోసం గరిష్టంగా ఇద్దరు అభ్యర్థులకు అనుమతించబడునని తెలిపారు. వివరాల కోసం జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో గాని, 9701177144, 99596495740 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పాల్గొనే యువతీ యువకులు తమ దరఖాస్తును వారి బయోడేటాతో ఈనెల 26న సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు జిరాక్స్ తో పాటు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను తీసుకొని రావాలని తెలిపారు. పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామాగ్రిని తమ వెంట తెచ్చుకోవాలని స్పష్టం చేశారు.

రైతుల పక్షాన నిలబడ్డ వ్యక్తి ఆలూరు గంగారెడ్డి

- నివాళులర్పించిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండల కేంద్రంలోని సొంత వ్యవసాయ క్షేత్రంలో గ్రామస్తులు ప్రేమ అభిమానంతో నిర్మించుకున్న ఆలూరు గంగారెడ్డి విగ్రహానికి.. గంగారెడ్డి రాజకీయ వారసురాలు విజయభారతి. తమ్ముడు చిన్న గంగారెడ్డి, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. రైతు జేఏసీ నాయకులు. వి. ప్రభాకర్. రైతు జేఏసీ నాయకులు లింగారెడ్డి. గ్రామ మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి. వీడీసీ చైర్ పర్సన్, తదితరులు శుక్రవారం. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రభాకర మాట్లాడుతూ.. గంగారెడ్డి ఏ పార్టీలో ఉన్నా రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతుల పక్షాన నిలబడ్డ నాయకుడు గంగారెడ్డి అని అన్నారు. ఎర్రజొన్నల సిండికేట్ వ్యాపారులకు వ్యతిరేకంగా జరిగిన పోరులో, మొక్కజొన్న గిట్టుబాటు ధర కావాలని జరిగిన ఉద్యమంలో, పసుపు బోర్డు సాధన కోసం జరిగిన ఉద్యమం పట్ల సానుకూల వైఖరికి ప్రదర్శించారని అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో నాటి టిఆర్ఎస్ పార్టీ. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, జేఏసీ భాగస్వామిగా అందరిని కలుపుకొని ముందుకు తీసుకెళ్లి నాయకుడని అన్నారు. అంటూనే తెలంగాణ సాధించుకున్న తర్వాత తాను ఉన్న పార్టీయేతనకు ద్రోహం చేసిందని చెప్పుకుంటూ బాధపడేవాడని గుర్తు చేసుకున్నారు. రైతు ఉద్యమం గొప్ప రైతు నాయకుడిని కోల్పోయిందని ఆ లోటు తీర్చలేనిదని అన్నారు.. విజయభారతి మాట్లాడుతూ నాన్న ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా భరించి రైతులకు సేవ చేస్తానని అన్నారు. సమాజ మార్పులో చదువు ముఖ్య పాత్ర పోషిస్తుందని నమ్మిన నాన్న ఆశయం కోసం ఆలూరులో గల హైస్కూల్‌లో స్కూల్ అభివృద్ధికి ప్రయత్నం చేస్తామని అన్నారు. అందులో భాగంగానే టెన్త్ క్లాసులో ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని అన్నారు. గత సంవత్సరం ట్రిబుల్ ఐటీ.. ఇతర పరీక్షల్లో ఎక్కువ మంది ఎన్నికయ్యే విధంగా కృషిచేసిన హెడ్మాస్టర్. రాష్ట్ర అవార్డు గ్రహీత, నరేందర్‌ను సన్మానించి మెమొంటో అందజేశారు. విజయభారతి స్కూల్‌ను సందర్శించి బాగోగులు చూసి సాయంకాలం పిల్లలకు స్నాక్స్ అందించే కార్యక్రమం చేపట్టి చదువుల పట్ల శ్రద్ధ తీసుకునే విధంగా చేయడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో బాబురావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


గంగారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలూరులో పిచ్చి కుక్కల స్వైర విహారం

- ఆరుగురికి తీవ్ర గాయాలు


కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. ఏడుగురుపై దాడి చేయగా ఇందులో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని దేగాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీడీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు కుక్కలను పట్టుకున్నారు.

రాజరాజేశ్వరి నగర్‌లో స్వచ్ఛత హి సేవ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని రాజరాజేశ్వరి నగర్ లో స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలు నిర్వహించారు. సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఏం. రాఘవేందర్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆయా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తీర్ణ అధికారి, ఏఎన్ఎం సాన, అంగన్వాడి టీచర్ గంగమణి, ఆశా కార్యకర్త శారద, తిరుమల, వినీల, శాంత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సాగునీటి సరఫరా


కొనసాగుతున్న సాగునీటి సరఫరా

నవతెలంగాణ-మెండోర

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వార సాగునీటి సరపరా కొనసాగుతుంది. ప్రాజెక్టులోకి వరద ప్రవాహం తగ్గడంతో వరద కాలువకు గురువారం రాత్రి నిటివిడుదల నిలిపివేసి సాగునీటిని సరఫరా చేస్తూ మిగులు జలాలు వదులుతున్నారు. ప్రాజెక్ట్ కి ప్రస్తుతం 8895 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా కాకతీయ కాలువ ద్వార 6800, సరస్వతి కాలువ ద్వార 550, లక్ష్మి కాలువ ద్వార 200, గుత్ప లిప్టు ద్వార 270 , అలీసాగర్ లిప్టు 135 , మిషన్ భగీరథ ద్వార 231 క్యూసెక్కుల తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రాజె పూర్తి స్థాయి నీటి మట్టం 1091(85 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టు 1090.90(80.053 టీఎంసీలు) అడుగుల నీరు ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

ఒకరి డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బిఎడ్ రెగ్యులర్ రెండవ సెమిస్టర్ పరీక్షలు అన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం జరిగిన పరీక్షకు 1278 విద్యార్థులకుగాను 1224 మంది హాజరైయ్యారు. 53మంది విద్యార్థులు గైరాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో ఒకరిని మాల్ ప్రాక్టీస్ కేసు బుక్ చేశారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

10వ రాష్ట్ర సాఫ్ట్ బాల్ పోటీలకు తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 21 నుండి 23 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సిరిసిల్లలో జరగనున్న రాష్ట్ర జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలికల విభాగంలో చిక్కాల శ్రీ వర్షిని, బాలుర విభాగంలో కళ్లెం శేఖర్, చలిగంటి సుశాంత్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన పాఠశాల క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ రాష్ట్ర జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలిపి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

అల్జీమర్స్‌ను అడ్డుకుందాం

- నేడు మతిమరుపు దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

పలకపై తుడిచేసిన అక్షరాలు అలా కనిపించి కనిపించకుండా పలుచగా అల్లుకుపోయినట్టుగా అనిపించినట్టుగానే.. మెదడు పలకంపై ఉండే జ్ఞాపకాలు అనుభవాలు నేర్పులు నైపుణ్యాలు శక్తులు సామర్థ్యాలు అన్నీ క్రమంగా చెరుపుకు పోయినట్టుగా చిరిగిపోయే రుగ్మత అల్జీమర్స్, బైకు లేదా కారు తాళాలు మర్చిపోవడం సాధారణ మతిమరుపు. కానీ నేర్చుకున్న డ్రైవింగ్ నే మరిచిపోవడం అల్జిమర్స్ కిచెన్లో అగ్గిపెట్టె ఎక్కడో పెట్టి మర్చిపోవడం మతిమరుపు కానీ, అగ్ని లేదా మంట అనే జ్ఞానాన్ని పూర్తిగా మర్చిపోవడం అల్జిమర్స్. మన అందరిలో ఏదో ఒక దశలో కనిపించే సాధారణ అంశం మతిమరుపు. కానీ దాని తారస్థాయిలా ఓ రుగ్మతలా కొందరిలో కనిపించే మెదడు సమస్య ఈ అల్జిమర్స్. గతంలో ఈ రుగ్మతతో చాలామంది బాధపడేవారు. ఇటీవల సైతం ఈ సంఖ్య చాలా ఎక్కువగా పెరుగుతుంది. నేడు అల్జమైర్స్ డే సందర్భంగా.. ఎందుకు వస్తుంది.. దానికి నివారణ.. పరిష్కారాలను తెలుసుకునేందుకు నవతెలంగాణ కథనం..

ఏమిటి అల్జిమర్స్..

అల్జిమర్స్ అనే ఓ జర్మన్ సైకియాట్రిస్టు ఈ రుగ్మతను కనుగొన్నాడు. దాంతో ఆయన పేరు ఈ వ్యాధికి పెట్టారు. పురుషులతో పోలిస్తే మహిళలు మూడు రేట్లు ఎక్కువగా అల్జిమర్స్‌కు గురవుతున్నారు. వయస్సుపై పడడం ప్రారంభమయ్యాక అన్ని కణాలతో పాటు మెదడు కణాలు అంటూ ఎంతో శిథిలమై పోతుంటాయి. కానీ కొందరిలో మాత్రం మెదడు కణాలు మరి ఎక్కువగా నశించి పోతుంటాయి. వారి మెదడు క్రమంగా కుంచించుకు పోతుంటుంది. ప్రధానంగా ఫ్రంటల్ టెంపోరలు, పెరైటాల్ అనే భాగాల్లోని కణాలు కుంచించుకుపోవడం వల్ల మెదడు తన బరువులో 20శాతం కోల్పోతుంది. ఇది బయటకు కనిపించేది. కానీ అత్యంత నిషితంగా మైక్రో స్కోపిక్ స్థాయిలో పరిశీలించినప్పుడు న్యూరోఫైబ్రీ లేటా రి టాన్సిల్స్ అనే అమైలాయిడ్ ప్రోటీన్లు మెదడు మీద కనిపిస్తాయి. ఈ ఆధారంగానే అల్జిమర్స్‌ను నిర్ధారణ చేస్తారు.

మొదటి, రెండు, మూడు దశల్లో..

రోజువారి చిన్న చిన్న విషయాలు కూడా మరుపునకు వస్తుంటాయి.. తాము చేయాల్సిన తోటి పనులు మరిచిపోతుంటారు. చాలా విలువైన వస్తువును ఇక్కడ పెట్టేసి పెట్టిన విషయాన్ని చోటును మరుస్తుంటారు. చాలా దగ్గరి స్నేహితుల పేర్లను. అంతెందుకు పొద్దున చదివిన న్యూస్ పేపర్‌లోని అంశాలు మర్చిపోతుంటారు. గతంలో జరిగిన బలమైన సంఘటనలు కాక ప్రస్తుత అంశాలను తొలత మరుస్తుంటారు. రెండవ దశలో తాము ఎక్కడున్నామన్న విషయాన్ని మరిచిపోతుంటారు. ఆరోజు తేదీ ఏమిటి ఆరోజు ఏ వారం అన్న విషయం గుర్తుండదు. మూడీగా ఉంటూ ముడుచుకుపోతుంటారు. మూత్రం, మలవిసర్జనపై అదుపు ఉండకపోవచ్చు. పగలంతా నిద్రపోతూ ఉండి రాత్రంతా మేలుకువతో అస్తిమితంగా ఉంటారు. మూడవ దశలో తలుపు గడేసుకోవడంతో పాటు దుస్తులు ధరించటం, షేవింగ్, స్నానం చేయాలన్న విషయలేమి వారి గమనంలో ఉండకపోవచ్చు. నిలబడలేక పోవడం, నడవలేకపోవడంతో పడకమీద అలా పడి ఉంటారు. అంతకుమునుపు తామంతత తాము రోజు చేసే అన్ని పనుల్లోనూ ఇతరుల మీద ఆధార పడాల్సి పరిస్థితి రావచ్చు. కొందరైతే జీవించి ఉండి కూడా పూర్తి స్పృహలు ఉండి కూడా ఏదీ చేయలేని ఓ దుంపల పడి ఉంటారు.

చికిత్స, నివారణ..

ఇప్పటికీ పలనా మందులే పని చేస్తాయని నిర్ధారణగా చెప్పడానికి వీల్లేదు. అలాగే పలానా మందుల ద్వారా రాకుండా చేసేందుకు వీలు లేదు. అయితే ఇలా వచ్చేందుకు అవకాశాలు ఉన్న వారిలో మాత్రం కొన్ని మందుల ద్వారా దీని తీవ్రతను తగ్గించేందుకు అవకాశం ఉంది. మనం తీసుకునే ఆహారంలో అల్జిమర్స్‌కు మంచి ఔషధంగా పనిచేసేవి ఉన్నవి విటమిన్ ఈ, ఒమేగా ఫ్యాటీ 3 యాసిడ్స్, కర్క్యుమన్

రిస్వొరాటల్ వంటివి ఇందులో కర్క్యు మెయిన్ అనేది మనం రోజు వంటలో వాడే పసుపులోను, రిస్వాటారల్ పోషకం ద్రాక్ష గింజల్లో పుష్కలంగా ఉంటుంది. ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ చేపల్లో ఎక్కువ. విటమిన్ ఈ పసుపు రంగు పండ్లలో పుష్కలంగా ఉంటుంది. క్యారెట్లు ఉండే బీటా కెరోటిన్, యాపిల్స్‌లో ఉండే ఎంతో సయానిన్, బెర్రీ పండ్లలో ఉండే ఫ్లోవెన్స్ లో కూడా అల్జిమర్స్‌ను నివారించే విటమిన్లు ఉన్నాయి. మంచి పోషకాలను ఇచ్చే సమతుల ఆహారం, ఆకుపచ్చని ఆకుకూరలు, తాజా కూరగాయలు తాజా పండ్లు, చేపలు, పసుపు, క్యాటర్, ద్రాక్ష, దానిమ్మ వాక్కయ వంటివి అన్నిఅల్జిమర్స్‌ను చాలావరకు నివారిస్తాయి. వీటికి తోడు పొగతాగడం, ఆల్కహాల్ వంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండడం కనీసం రోజుకు 20 నిమిషాలకు పైబడి చేసే వ్యాయామాలు, కంటి నిండా నిద్రపోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు డయాబెటిస్, హై బీపీ వంటి జీవనశైలి రుగ్మతలను నియంత్రణలో పెట్టుకోవడం వంటివి అల్జీమర్స్ నివారణకు తోడ్పడతాయని వైద్యులు చెబుతున్నారు.

యుఎస్ వంటి దేశాలతో పోలిస్తే మన దేశంలో అల్జిమర్స్‌తో బాధపడే వారి సంఖ్య ఇప్పటికి తక్కువే. కానీ వీరి సంఖ్య క్రమక్రమంగా విపరీతంగా పెరుగుతుంది? 2031 నాటికి మన దేశంలోనీ జనాభాలో సీనియర్ సిటిజన్ల సంఖ్య 19.4 కోట్లు ఉండవచ్చని వీరిలో దాదాపు 4.4శాతం నుండి 5శాతం వరకు అల్జిమర్స్ బాధితులు ఉండవచ్చని ఒక అంచనా.

కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాలి..



మంచి మంచి పుస్తకాలు చదవడం, కొత్త భాషలను విద్యలను నేర్చుకోవడం కొత్త నైపుణ్యాలను పెంచుకోవడం, మెదడు చురుగ్గా ఉండేలా చేసే పజిల్స్ పరిష్కరించడం వంటి ఆరోగ్యకరమైన హాబీలు అల్జిమర్స్‌ను దూరంగా ఉంచుతాయి. దీన్ని గుర్తుపట్టడం కష్టమైనా అటు కుటుంబ సభ్యులు కొన్ని సందర్భాలలో ఇటు డాక్టర్లు కూడా దీన్ని తేలిగ్గా గుర్తుపట్టలేరు. తొలుత మతిమరుపుల కనిపించే ఇది మూడు దశల్లో తన తీవ్రత చూపుతుంది.

డాక్టర్ కేశవులు, మానసిక వైద్య నిపుణులు. నిజామాబాద్

జన్యుపరమైన కారణాలు



సాధారణంగా చాలా వరకు జన్యుపరమైన కారణాలు, ఆ తర్వాత కొంతవరకు పర్యావరణ అంశాలు ఈ రుగ్మతకు కారణం కావచ్చు. స్నేహితులు, బంధువులతో ఆరోగ్యకరమైన సంబంధాలను నడపడం, మంచి చురుకైన సామాజిక జీవనాన్ని గడపడం వంటి అంశాలన్నీ అల్జీమర్స్‌ను నివారిస్తాయి..

డాక్టర్ శేఖర్ రెడ్డి, వైద్యులు, ప్రైమ్ ఆశ హాస్పిటల్ , పెర్కిట్.

గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



- ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జానకి

నవతెలంగాణ-ఎడపల్లి

గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని బోధన్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జానకి అన్నారు. శుక్రవారం ఏఆర్పి క్యాంప్ ఉన్నత పాఠశాలలో పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన సీమంత కార్యక్రమాలకు సీడిపిఓ జానకి, మండల పర్యవేక్షకురాలు విజయ రాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్పీ క్యాంప్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిఫీర్దోస్, అంగన్వాడీ మండలం పర్యవేక్షకురాలు విజయ రాణి, అంగన్వాడీ ఉపాధ్యాయులు, సుజాత, రిబికా, ఆశ వర్కర్లు, ప్రధానోపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శనివారం | సెప్టెంబర్ 21, 2024 | www.navatelangana.com

గణేష్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని నేతాజీ నగర్ గణేష్ మండలి 35 వార్షికోత్సవ నిమజ్జన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ నగర్ గణేష్ మండప నిర్వాహకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే విగ్నేశ్వరుడికి పూజలు నిర్వహించారు. కాగా మండప నిర్వహాకులు శాలువా పూలమాలతో ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్‌రెడ్డి, జంబిగే హన్మాండ్లు, మోహన్‌రెడ్డి, బొడ్ల రాజు, చిప్ప శివ, తదితరులు పాల్గొన్నారు.

భర్తపై హత్యాయత్నం.. ఆపై డ్రామా

- నాగిరెడ్డిపేట్ మండలం బంజారా తండాలో ఘటన
- రెండు రోజుల్లోనే కేసును చేధించిన పోలీసులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

భార్యపై హత్యాయత్నం చేసిందో భార్య. రోజంతా కష్టపడి అలసిపోయి నిద్రపోతున్న భర్తపై గొడ్డలితో దాడిచేసి హత్యాయత్నం చేసి ఓ సినిమాలా డ్రామా క్రియేట్ చేసింది. ఈ ఘటన మండలంలోని బంజారా తండాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తనతోపాటు గాఢ నిద్రలో ఉన్న భర్త మోహన్‌ను చంపడానికి పతకం పన్నింది. గొడ్డలితో మెడపై పెద్ద గాయం చేసింది. భర్త చనిపోయాడని నిర్ధారణ కాగా హత్యయత్నానికి వాడిన గొడ్డలిని దాచేసింది. తెలివితేటలు ఉపయోగించి తండాలో గణపతి వద్ద నిద్రపోతున్న యువకులను లేపి ఎవరో గుర్తు తెలియని దుండగులు వచ్చి తన బంగారు అభరణాలు దోచుకొని తన భర్తను గాయపరిచి పారిపోయానని డ్రామా క్రియేట్ చేసింది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు, సిఐ రవీందర్ నాయక్ ఘటనా స్థలానికి డాగ్‌స్వాడ్‌తో చేరుకుని పరిశీలించారు. అనంతరం ఫింగర్ ప్రింట్స్ స్వీకరించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. స్పృహలోకి వచ్చిన భర్త మోహన్ తన భార్యనే తనను హతమార్చడానికి ప్రయత్నించిందని చెప్పడంతో



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పారిపోతున్న నిర్మలను గోపాల్‌పేట్ బస్టాండ్ ప్రాంతంలో పట్టుకొని విచారించారు. తానే నేరం చేసినట్లు ఒప్పుకుంది. తన భర్త ప్రతినెల అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యం కొరకు మందులను తరచుగా వాడేవాడని తమకు తమ భర్తతో ఎలాంటి ఉపయోగం లేదని ఉద్దేశంతో ఈ హత్యాయత్నం చేసినట్లు నిర్మల ఒప్పుకున్నట్లు సిఐ తెలిపారు. నూతన చట్టం ప్రకారం 109 బిఎంఎస్ ప్రకారం నిర్మలను శుక్రవారం జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ గంగారాంకు రివార్డు..

బంజారా తండాలో జరిగిన ఘటనపై చాకచక్యంగా వ్యవహరించి పలు కోణాల్లో దర్యాప్తు జరిపి హత్యాయత్నం మోహన్‌పై తన భార్య నిర్మలనే చేసినట్లుగా పలు ఆధారాలు సేకరించడంతో ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ కానిస్టేబుల్ గంగారంను రివార్డుతో అభినందించారు.

పారిశుధ్యంపై నిఘా అవసరం

- డిఎల్పీఓ నాగరాజు

నవతెలంగాణ-పిట్లం



సూచనలు చేస్తున్న డీఎల్పీవో

పారిశుధ్యంపై ప్రత్యేక నిఘా అవసరమని డిఎల్‌పిఓ నాగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వార్డులలో ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాల దృష్ట్యా ప్రజలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. అందుకుగాను ప్రతి గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్యంపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు మురికి కాలువల శుభ్రం చేసి, మురికి చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని ఆదేశించారు. రక్షిత మంచినీటి ట్యాంకుల వద్ద గుంతలు, చెత్తచెదారం లేకుండా చూడాలని అన్నారు. ట్యాంకులకు వారంలో ఒకసారి క్లోరినేషన్ తప్పనిసరి చేయాలని సూచించారు. ఏదేని గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఆ పంచాయతీ సెక్రటరీపై చర్యలు తప్పవని ఆదేశించారు. అనంతరం నీటి నిల్వలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, పంచాయతీ సెక్రటరీ యాదగిరి, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన దెబ్బెడ నవీన్ (30) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాటాపూర్ గ్రామానికి చెందిన నవీన్ గత ఆరు నెలల కిందట గంగాసారం గ్రామానికి చెందిన కాపు వారి వద్ద జీతం మాట్లాడుకుని పనిచేసేవాడు. గత నెల రోజుల కిందట సాటాపూర్ గ్రామానికి వచ్చి తిరిగి వెళ్లకపోవడంతో అతని భార్య స్వప్న పనిచేయకుండా తిరుగుతున్నావని మందలించింది. దీంతో రాత్రి తన ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల నూతన తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన శశిభూషణ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుక్రవారం సన్మానించారు. కార్యాక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంధర్నా రవి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఖాజాపూర్ అశోక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీహారి హన్మంతు, యువజన నాయకులు దేశిపేట్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

బాల్యవివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణపై కెనడి పాఠశాలలోని విద్యార్థులకు సాధన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సంధ్యారాణి, గిరిజా శుక్రవారం అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేస్తే జరిగే నష్టాల గురించి, బాల్యవివాహాలను ఎలా అరికట్టాలో, ఎవరెవరికి సమాచారం ఇవ్వాలో తెలియజేశారు. బాల్యవివాహాల గురించి తెలియజేసినప్పుడు చైల్డ్‌లైన్ 1098కి, పోలీస్ శాఖ 100కు సాధన (సాధన) సంస్థకు, గ్రామ కార్యదర్శికి, తహసీల్దార్‌కు చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారికి, సిడిపిఓ(సీడీపీవో), బిబిఏ (బిబిఎ) హెల్త్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1800-102-7222కు, అంగన్వాడీ వర్కర్లకు, పాఠశాల టీచర్లకు, ప్రజాప్రతినిధులకు తక్షణమే సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కెనడీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ డానియల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన మండల నోడల్ అధికారి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మండల నోడల్ అధికారి వై.తిరుపతిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. బేస్ లైన్ టెస్ట్, ఎఫ్ఏఎస్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పరిశీలించారు. ఫండమెంటల్ లిటరసీ న్యూమరల్ ప్రకారం విద్యార్థులకు బోధన నిర్వహించాలని విద్యార్థులలో కనీస బోధన సామర్థ్యాలు వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మ్యాస్ పరీక్ష పత్రాలను పరిశీలించి మార్కులను ఆన్లైన్ చేయవలసిందిగా ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం మోడల్ లెసన్‌ను తరగతి గదిలో పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు సంపత్ కుమార్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైట్ల వితరణ



లైట్లను వితరణ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన అమ్మ ఫౌండేషన్ సభ్యులు లైట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు లేని కారణంగా చీకటిగా ఉంటుందని గుర్తించి అమ్మ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో లైట్లను వితరణ చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, ఉపాధ్యాయులు సుభాన్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-దోమకొండ



మాట్లాడుతున్న ఎంపీడీవో

స్వచ్ఛ గ్రామానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా తడి చెత్త పొడి చెత్తపై గ్రామ సంఘం మహిళలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రతగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపిఓ రజని, సీనియర్ అసిస్టెంట్ మానిక్‌రావు, పంచాయతీ కార్యదర్శి రమేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఏపీఎం రాజు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్



ఎంపీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మండలంలోని కాంగ్రెస్ నాయకులు జహిరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొంబోతుల లింగాగౌడ్, జిల్లా గౌడ సంఘం జనరల్ సెక్రటరీ బాలార్జున్ గౌడ్, మండల ప్రధానకార్యదర్శి లక్ష్మిపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభతరమైన విద్యనందించాలి

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థులకు సులభతరమైన విద్యనందించాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారి వామన్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దెల చెరువు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చి విద్యనందించాలన్నారు. విద్యర్థుల స్థాయిని బట్టి వారి కనుగుణంగా విద్యాబోధన నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూ, విద్యార్థులకు క్రమశిక్షణ అలవాట్లను నేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మంత్రి మధుసూదన్, జ్యోతిలక్ష్మి, నిర్మల, ఏఎన్ఎం స్వాతి, కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

- మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు

నవతెలంగాణ-ఎడపల్లి

రైతులు వరి పంటకు మోతాదుకు మించి యూరియా వాడితే పంటకు అనేక రోగాలు చుట్టుముడుతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పోచారం గ్రామ శివారులో గల పంట పొలాలను ఆయన సందర్శించారు. రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. దూపల్లి సహకార సంఘం డైరెక్టర్, పోచారం గ్రామానికి చెందిన రైతు నీరడి రవికుమార్, రైతులు తదితరులున్నారు.

వికలాంగులకు ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి



ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

వికలాంగ విద్యార్థులకు క్రమం తప్పకుండా వ్యాయామం నిర్వహించాలని ఫిజియోథెరపీ డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న 8 మంది వికలాంగ విద్యార్థులకు మండల విద్యా వనరుల కేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్దనే చిన్నచిన్న వ్యాయామ ఆసనాలను చేయించినట్లయితే వారి అవయవ లోపం క్రమేపీ తగ్గుదల ఉంటుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టి గైని చిన్న సాయిలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజు, సునీల్, పంచాక్షరి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మర్కల్‌లో స్వచ్ఛతాహీ సేవా

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాప్, టీ షాపుల పరిసరాల నుంచి అన్ని ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. 8 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రావణి, ఉదయిని, అధ్యాపకులు, మర్కల్ గ్రామ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

బోరు వేయించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సూచన మేరకు 46వ వార్డులో నీటి సమస్య ఉందని కౌన్సిలర్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి బోర్ వేయించారని వార్డ్ కౌన్సిలర్ కోయల్కర్ కన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్ పంపరి లత శ్రీనివాస్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

- ఎంపీడీవో వెంకటేశ్ యాదవ్

నవతెలంగాణ-రెంజల్

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి సముచితమైన స్థానం ఉందని, అంకిత భావంతో ఉపాధ్యాయులు పనిచేసినప్పుడే గుర్తింపు ఉంటుందని, రెంజల్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదర్శ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందన్నారు. రెంజల్ మండలంలో పిఆర్ టియూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని 15 మంది ఉపా ధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లను అందజేశారు. ఈ ఎంఈఓ గణేష్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మండల కాంప్లె క్స్ ఉపాధ్యాయులు కట్ట ఆంజనేయులు, ఈ.శంకర్, పిఆర్‌టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, కిషోర్, ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, అనురాధ, ఈశ్వర్, అబ్దుల్ కరీం, ఫిరోజ్, స్థానిక ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

- అందరూ టి సెట్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి
- కామారెడ్డి పోలీస్ కళాబృందం

నవతెలంగాణ-కామారెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అందరూ టి సెట్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని కామారెడ్డి పోలీస్ కళాబృందం తెలిపింది. శుక్రవారం కామారెడ్డి డిగ్రీ కళాశాలలో కళాబృందం ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం, సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ గురించి, బాల్య వివాహాలు గురించి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీం నెం.8712686094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్‌చేసి వినియో గించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల టోల్ ఫ్రీ నెంబర్స్ 100, 108, 1930, 181ల విలువలను తెలియజేశారు. ప్రతి మహిళ ఫోన్‌లో ఈ-సేఫ్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఇది మహిళలకు చాలా అత్యవసరమైనదని పేర్కొన్నారు. కార్యక్రమానికి కళాబృందం సభ్యులు, సాధన శాఖ సభ్యులు, షీ టీం సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ శాఖ అధికారిని శారదా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావొద్దు

- ప్రముఖ ఇంపాక్ట్ ట్రైనర్ నక్క నవీన్

నవతెలంగాణ-గాంధారి

విద్యార్థులు తప్పుడు పనులకు, చెడు అలవాట్లకు బానిస కావొద్దని ప్రముఖ ఇంపాక్ట్ ట్రైనర్ నక్క నవీన్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన "మానసిక ఆందోళనలు తక్షణ పరిష్కారం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారం అధ్యక్షత వహించగా నక్క నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో మానసిక ఆందోళనలు సహజంగా వస్తుంటాయని అలాంటప్పుడు మానసికంగా ఇబ్బందులు పడకుండా శారీరకంగా వ్యాయామం చేయడం, స్నేహితులతో సమస్యలను పంచుకోవడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ కోఆర్డినేటర్ లోక శ్రీధర్, కళాశాల అధ్యాపకులు పాక రాజ గోపాల్, ఎన్.లక్ష్మణ్, జెట్టి విజయ్‌కుమార్, రమేష్, వెంకట స్వామి, సరిత, స్వప్న, రాజకుమార్, అంజలి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంపాక్ట్ ట్రైనర్ నవీన్

రైతాంగానికి ప్రయోజనం చేకూర్చేలా వ్యవసాయ మార్కెట్ కమిటీలు

- మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్యా దామోదర్

నవతెలంగాణ-ఎడపల్లి

రైతుల అభివృద్ధి వారి కష్టసుఖాలను పంచుకునేదే కాంగ్రెస్ ప్రభుత్వమని రైతాంగానికి మరింత ప్రయోజనం చేకూర్చేలా వ్యవసాయ మార్కెట్ కమిటీలు, చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని మార్కెట్ వ్యవసాయ కమిటీ చైర్మన్ అంకు సంధ్యా దామోదర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని గోదాములను ఆమె పరిశీలించారు. జానకంపేట ప్రధాన రహదారిపై ఉన్న మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. మరి కొద్ది రోజుల్లో వరి కోతలు ప్రారంభమవుతాయని అందుకు అనుగుణంగా గోదాముల నిర్వహణ పారదర్శకంగా ఉండాలన్నారు. ఏఎంసి ఆధ్వర్యంలో బార్డర్‌లోని చెక్ పోస్టులలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహిస్తామన్నారు. చెక్‌పోస్ట్‌లో రికార్డులను పరిశీలించారు. అంతకుముందు ఆమెతో పాటు అధికారులు జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట కార్యదర్శి రామనాథరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు చైర్మన్ శంకర్, డైరెక్టర్లు బొబ్బిలి శ్రీనివాస్, కిషోర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది రైతులు తదితరులున్నారు.



గోదాములను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

కిషోర్ బాలికలు రక్తహీనత నుండి బయటపడాలి

- సూపర్వైజర్ ఎస్తేరు రాణి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


మాట్లాడుతున్న సూపర్వైజర్ ఎస్తేరు రాణి

కిశోర బాలికలు రక్తహీనత నుండి బయటపడాలని అంగన్వాడి సూపర్వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో కిషోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు కలిసి కిషోర బాలికలకు రక్తహీనత గురించి వివరిస్తూ ఐరన్ టాబ్లెట్లు, ఆరోగ్యం, పరిశుభ్రత గురించి, బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, ఆరోగ్యాన్ని ఏ విధంగా కాపాడుకోవాలో వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

ఆడబిడ్డ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ముప్కాల్


ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ

మండల కేంద్రానికి చెందిన పొన్న రమణికకు ఆడబిడ్డ జన్మించడంతో వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉమ్మడి బాల్కొండ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు జోగు సంగీత-నర్సయ్య దంపతులు రూ.5 వేల రూపాయల నగదును అందజేశారు. గతంలో ప్రకటించిన విధంగా ముప్కాల్ మండల కేంద్రంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు రూ.5 వేల రూపాయలను అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం రమణిక కుటుంబ సభ్యులు జోగు సంగీత-నర్సయ్య దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి వెంట మయూర్, సుఖిత్ బాబు, వంశీ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అగ్రిమెంట్

- సంఘం అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి
- తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో సంఘ మహాజన సభ


మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో సంఘం 65వ మహాజన సభాసమావేశం సంఘ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి 1-4-23 నుండి 31-3-24 వరకు అయిన జమ, ఖర్చులను చదివి వినిపించారు. అనంతరం సంఘ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... నాఫెడ్ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొనుటకు అగ్రిమెంట్ అయ్యిందని అన్నారు. రైతులు పంటను అమ్మే క్రమంలో వారి వెంట పట్టాదార్ పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి మద్దతుధర పొందవచ్చని తెలిపారు. అలాగే వడ్ల కొనుగోలు సెంటర్ కూడా టీఎస్‌సీఎస్‌సీ ద్వారా ఏర్పాటు చేసుకోవడానికి తీర్మానించామని అన్నారు. సిబ్బంది జీతాలు చెల్లించడానికి తగిన వనరులు లేనందున ప్రతి ఎరువుల బస్తాపై 10 రూపాయలు పెంచడానికి ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు జి.కే.శ్రీనివాస్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు దేశబోయిన చిన్న సంజీవ్, గోపిడి చిన్నోళ్ళ రాజారెడ్డి, బడిగిరి సాయిరాం, బద్దం రవీంధర్, సంఘ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుపై బీఆర్ఎస్‌ది అనవసర రాద్ధాంతం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబమని, మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని, శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ఒక నిర్ణయాత్మక మైన తీర్పు ఇచ్చిన ఇంకా వారిలో మార్పు రాలేదని డిచ్ పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమృతాపూర్ గంగాధర్ మాట్లాడుతూ.. సెక్రటేరియట్ ఎదుట రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై గగ్గోలు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులు ఇంత కాలంగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడం ఎందుకు మర్చిపోయారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ తెలంగాణ ఉద్యమం ఎక్కడ చేశారని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని తాకే అర్హత లేదన్నారు. పదేళ్లలో లేని ప్రేమ తెలంగాణ తల్లి పై మీకు ఇప్పుడు వచ్చిందా అని బీఆర్ఎస్ నాయకులను ఆయన నిలదీశారు. తాము ఏకంగా సెక్రటేరియట్ లోపల తెలంగాణతల్లి విగ్రహం పెడుతున్నామన్నారు. రాజీవ్ గాంధీని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని అన్నారు. రాజీవ్ విగ్రహాన్ని తొలగిస్తామంటున్న సన్నాసులు, దద్దమ్మలకు సోనియా కాళ్లు మొక్కినప్పుడు రాజీవ్ ఆమె భర్త అని గుర్తుకు రాలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఫాంహౌజ్ నుంచి బయటకు రాని మీకు రాజకీయ భవిష్యత్ లేదన్నారు. మరోసారి రాజీవ్ విగ్రహాన్ని తొలగిస్తామన్న వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు రూరల్ లో ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని అన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు ధర్మ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాం సన్, వాసు, లచ్చమొల్ల దత్తాద్రి, శకటి మురళి, దావీదు, మోహన్ రెడ్డి, మేకల నారాయణ, జాన్‌సన్, రామకృష్ణ, మండల కిసాన్ ఖేత్ అధ్యక్షుడు సాయి రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత కారాగార శిక్ష విధిస్తు నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల శుక్రవారం సంచలన తీర్పు వెలువరించారు. నిజామాబాద్ నగరంలోని నాగారం బ్రాహ్మణ కాలనీకి చెందిన షేక్ మజీద్‌ను హత్యచేసిన షేక్ జుబేర్‌కు, హత్యకు సహకరించిన షేక్ అతీక్‌లకు జీవితకారాగార శిక్ష విధించారు. ఎల్లమ్మ గుట్టకు చెందిన షేక్ జుబేర్ భార్యను ఒక గంట పంపిస్తే నీకు రెండు వేల రూపాయలు ఇస్తానని షేక్ మజీద్ ఒక సమయంలో అన్నాడు. చీటికీ మాటికి ఫోన్‌చేస్తు వేధించేవాడు. ఆయన వేధింపులు భరించలేక తన చిన్న నాన్న అయిన ఎల్లమ్మ గుట్ట వాసి షేక్ అతీక్‌ను తన ఆటోలో వెంట పెట్టుకుని 29 డిసెంబర్ 2021న నాగారంలోని బహ్మణ కాలనీకి వెళ్లి మజీద్‌ను ఆటోలో తీసుకుని డిచ్‌పల్లి మండల శివారులోని బర్ది పూర్ గ్రామంకు వెళ్లారు. కల్లు తాగిన మత్తులో ముగ్గురు ఆటోలో తిరుగు పయణం అయ్యారు. తన భార్య పట్ల అవమాన కరంగా మాట్లాడడం భరించలేని షేక్ జుబేర్ ఆటోలో తనతోపాటు కూర్చున్న మజీద్‌ను వెంట తెచ్చుకున్న చాకుతో కడుపులో పొడిచాడు. ఆటోను ఆపిన షేక్ అతీక్ మజీద్‌ను వెనుక బలంగా పట్టుకున్నాడు. తిరిగి జుబేర్ మళ్లి కత్తితో పొడిచి హత్యచేసి బార్దిపూర్ గ్రామ శివారులో కాలువలో పడవేశారనే నేర అభియోగాలు కోర్టు న్యాయ విచారణలో రుజువు అయ్యాయి. దీంతో ముద్దాయిలు ఇద్దరికి హత్య కేసులో జీవిత ఖైదు రెండు వేల రూపాయల జరిమాన, సాక్ష్యాలను లేకుండా చేయడం అనే నేరం ప్రకారం ఏడేళ్ల కఠిన జైలుశిక్ష విధిసు సెషన్స్ జడ్జి సునీత తీర్పు చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- జోనల్ లెవెల్ స్పోర్ట్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో రాజారామ్ స్టేడియంలో నిర్వహించిన బాసర జోనల్ లెవెల్ ఫారెస్ట్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ 2024 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకు వివిధ జిల్లాల నుండి విచ్చేసిన ఫారెస్ట్ అధికారులు ఘన స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన, పతక ఆవిష్కరణ చేసి కాగడ ప్రజ్వలనతో స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం పర్యావరణ పరిరక్షణకు అడవులను కాపాడుతు వన్యమృగాలను కాపాడుతున్న అటవీశాఖ అధికారులను అభినందిస్తూ విధినిర్వహణలో నిత్యం ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్న వారికీ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. ఇందూర్ జిల్లా అంటేనే క్రీడలకు పెట్టింది పేరని, జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన నిక్కత్ జరీన, యెండల సౌందర్య లాంటి క్రీడాకారులు ఉన్నారని గుర్తు చేశారు. ఇందూర్ జిల్లాలో స్పోర్ట్స్ ట్రాక్స్ నిర్మాణం, ఇండోర్ స్టేడియంల నిర్మాణం, మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఇవే అంశాలపై అసెంబ్లీలో ప్రస్తావించానని, ఇంచార్జ్ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయయానని తెలిపారు.


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తన పిరియడ్‌లో తప్పకుండ పాత కలెక్టర్ గ్రౌండ్‌లో ట్రాక్, ఇండోర్ స్పోర్ట్స్ నిర్మాణం, రాజారామ్ గ్రౌండ్ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సి. శరవణన్ ఐఎఫ్ఎస్సి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బాసర సర్కిల్, బోగా నికిత ఐఎఫ్ఎస్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ నిజామాబాద్ ఇంచార్జ్, ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ ఐఎఫ్ఎస్సి జిల్లా అటవీ అధికారి-ఆదిలాబాద్, రవి ప్రసాద్ డిప్యూటీ సీఎఫ్ జిల్లా అటవీ అధికారి-జగిత్యాల, ఎస్ఏ నాగిని బాను ఎస్ఎఫ్ఎస్ జిల్లా అటవీ అధికారి- నిర్మల్, (ఎఫ్ఏసీ) రవీందర్ ఎస్ఎఫ్ఎస్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, ఎఫ్ఎస్‌పీ బాసర సర్కిల్, కె.సుధాకర్ రావు ఎస్ఎఫ్ఎస్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, నిజామాబాద్, భవానీ శంకర్ ఎస్ఎఫ్ఎస్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, ఆర్మూర్, ఎఫ్ఆర్ఓలు పద్మారావు, రవి మోహన్ భట్, సంజయ్ గౌడ్, ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సాయిరాం, నాలుగు జిల్లాల ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో నిమిషంలో పెను ప్రమాదం తప్పింది. చౌదర్‌పల్లి బూదమ్మ ఇల్లు ఒక్కసారిగా పెచ్చులు ఊడి నిద్రపోతున్న పిల్లల పక్కన పడడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, జిల్లా అధ్యక్షురాలు అనిత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో వర్షాకాలంలో అంబేద్కర్ కాలనీలో ఉన్న ఇండ్లను పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వర్షాకాలం ఉన్నప్పుడు కలెక్టర్ అక్కడ ఉన్న స్థానికులను అపార్ట్మెంట్స్‌లో ఉండండి అని సలహాలు ఇచ్చారని, ఆ తర్వాత ఇంటి నిర్మాణాల కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదని తెలిపారు. కనీసం ఇప్పుడన్నా నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ఇంటి నిర్మాణం పనులు చేపట్టాలని అన్నారు. అంబేద్కర్ కాలనీలో కూలిపోయే దశలో దాదాపు 35 నుంచి 40 ఇండ్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని లేదంటే అంబేద్కర్ కాలనీలో కూలిపోయే దశలో ఉన్న ఇండ్లకోసం ప్రత్యేక పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.


బాధితురాలితో మాట్లాడుతున్న ఐద్వా ప్రతినిధులు


పెచ్చులూడిన దృశ్యం

ఆర్వోబీ నిర్మాణాల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టండి

- కొత్త ఆర్ఓబీలు మంజూరు చేయండి
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరిన ఎంపి అర్వింద్
- కొద్ది రోజుల్లో కాజీపేట్ - దాదర్ రైలు ప్రారంభం మంత్రి హామీ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్


మంత్రికి విన్నవిస్తున్న ఎంపీ

పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం నడుస్తున్న ఆర్వోబీల నిర్మాణాలను వేగవంతం చేసేలా అధికారులకు తగు సూచనలు జారీ చేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవిని కోరారు నిజామాబాద్ ఎంపీ అర్వింద్. ఈ సందర్భంగా ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయి, పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించి, పెండింగ్ లో ఉన్న పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారానికి ఒకసారి నడిచే కాజీపేట్ - దాదర్ రైలుని అత్యంత త్వరగా నడిపి, వారానికి మూడుసార్లు నడిచేలా చేయాలని ఎంపీ కోరగా, అతి కొద్ది రోజుల్లో రైలు నడిచేలా తగు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా పార్లమెంట్ పరిధిలో అవసరమైన చోట్ల కొత్త ఆర్ఓబీలు, ఆర్ యూబీల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, దేశ రాజధాని ఢిల్లీకి నిజామాబాద్ మీదుగా రైలు సర్వీస్‌ని నడపాలని, పార్లమెంట్ పరిధి మీదుగా తిరుపతి, ముంబైలకు కొత్త రైళ్లను నడపాలని కోరారు. అంతేకాకుండా గత రాష్ట్ర ప్రభుత్వాల జాప్యం కారణంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్ -ఆదిలాబాద్, బోధన్ -బీదర్ రైల్వే లైన్ల మంజూరు చర్యలను వేగవంతం చేయాలని ఎంపీ అర్వింద్ కోరారు. అమృత్ భారత్ కింద 53 కోట్లతో చేపడుతున్న నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు. అంతేకాకుండా పార్లమెంట్ పరిధిలో రైల్వేల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ పేర్కొన్నారు. తాను చేసిన విజ్ఞప్తుల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్లు మంత్రి వివరించారని, అందుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో బలమైన విప్లవ విద్యార్థి ఉద్యమాలను నిర్మించండి

- పీడీఎస్‌యూ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ
- 50 వసంతాల స్వర్ణోత్సవ సభల పోస్టర్స్, లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ-సిరికొండ

విద్యార్థి అమరవీరుల అమరత్వం స్ఫూర్తితో బలమైన విప్లవ విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలని, శాస్త్రియ విద్యావిధానం కోసం, నవసమాజం నిర్మాణం కోసం పోరాడాలని పీడీఎస్‌యూ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పిట్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో పీడీఎస్‌యూ సిరికొండ, ధర్పల్లి, భీమగల్ మండలాల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభల పోస్టర్స్, లోగో ఆవిష్కరణ చేశారు. దేశంలో పేదలు అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ సమానమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలని, విద్యార్థి ఉద్యమాలను కొనసాగిస్తుందన్నారు.ఈ నెల 30న న రాష్ట్ర స్థాయిలో హైదరాబాదులో జరిగే 50 వసంతాల స్వర్ణోత్సవ సభలో 50 ఏళ్ల విద్యార్థి ఉద్యమాన్ని సమీక్షించి, విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుంటారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలి అని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు, పీడీఎస్‌యూ జిల్లా మాజీ కార్యదర్శి దామోదర్, సాయరెడ్డి, మండల నాయకులు రమేష్, లింబాద్రి, కిషోర్, బాలకిషన్, పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ నాయకులు అశిష్, విశ్వాతేజ్, ప్రవీణ్, . మురళి, తిరుపతి, కళ్యాణ్, ప్రణీత్ పాల్గొన్నారు


పోస్టర్స్, లోగో ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి


సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న మండల అధ్యక్షులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇందల్ వాయి మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ అన్నారు.శుక్రవారం ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాలక్ష్మి పథకం ఎల్‌పీజీ సబ్సిడీ పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మోత్కూరి నవీన్ గౌడ్ మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారికి రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నా మన్నారు. సిలిండర్ తీసుకున్న నాలుగు రోజుల్లో రాయితీ డబ్బులు జమ కాకుంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని, త్వరలోనే అర్హులైన వారందరికి రేషన్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వాచర్ మల్లయ్య, గట్టు కొడారి, తోట రాజన్న, కమ్మరి గంగాధర్, నిఖిల్ రెడ్డి, రన్వీర్, శివ, మాణిక్యం, గంగాధర్, మహిళలు పాల్గొన్నారు.

పిజిటి పోస్టుకు ధరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఖాళీగా ఉన్న పి జి టి ఎకనామిక్స్ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి దశరథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిటి ఎకనామిక్స్, సంబంధిత సబ్జెక్ట్‌లో డిగ్రీ, బిఎడ్, టెట్ పరీక్ష అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. 23 సెప్టెంబర్ తేది దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఉందని తెలిపారు. అదే రోజు ఇంటర్వ్యూ, డెమో ఉంటుందని, మరిన్ని వివరాలకు 9199484 99296 సంప్రదించాలని పేర్కొన్నారు.

దళితుల భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలం మునిపల్లి గ్రామంలో దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న 12 మంది పైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సుమారుగా 50 మంది దళితులు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు రావట్ల నచ్చన్న మాట్లాడుతూ మాదిగ కులానికి చెందిన తనకు ఒక ఎకరం భూమి ఉన్నదని, కానీ ఆ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జాచేస్తూ అందులో శివలింగం ప్రతిష్టాపన చేసుకున్నారని తెలిపారు. ఇదేమిటి అని అడిగిన మమ్మల్ని దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నరన్నారు. ఈ విషయమై జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఎస్‌హెచ్ఒకు ఫిర్యాదు చేయగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తూ తమకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెల్ల మజ్నా, గుమ్మెర్ల గంగారం, గుమ్మర్ల నరసయ్య, సాగర్, గోపి, భూమేష్, రాహుల్, అభి, గైని రమేష్, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేపటి నుండి (21 నుండి 23) సోమవారం వరకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్ 17) సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థి యస్. సిద్దార్థ ఎంపిక అయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు . ఈనెల 9న ఆర్మూర్ లో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన యస్. సిద్దార్థను శుక్రవారం పాఠశాలలో అభినందించారు . ఈ సందర్భంగా ఆర్ నర్సయ్య మాట్లాడుతూ నిరంతర అబ్యాసం వలన నైపుణ్యాలు మెరుగుపడతాయాన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు అనిల్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

తెగులు సోకిన వరి పంట పొలాల పరిశీలన


మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణ అధికారి రోచన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ గ్రామంలోని తెగులు సోకిన వరి పంట పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి రోచన శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటలో చీడపీడల సమస్య ఎక్కువ ఉందని, కావున రైతు సోదరులు అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. వరిలో ప్రస్తుతం బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఉధృతి ఎక్కువగా ఉందని తెలిపారు. రైతులు తెగులు లక్షణాలు గమనించిన వెంటనే తెగులు ఉధృతి అదుపుచేయడానికి ప్లాంటామైసిన్ మందును 80 గ్రాములు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంట బోజారెడ్డి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు సుద్దపల్లి విద్యార్థినుల ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు సాత్విక, గంగోత్రి, నేహశ్రి, శ్రావిక, లిఖిత, నిశిత, కీర్తన, రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నళిని శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 21 నుండి 23 వరకు సిరిసిల్లలో జరగబోయే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని అన్నారు. వారికి ప్రిన్సిపాల్ నళిని, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, పిడి అనుష, పిఈటి శ్రీలత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక క్రీడాకారులను అభినందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబర్చాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | సెప్టెంబర్ 21, 2024 | www.navatelangana.com

ఇందూరు బాలోత్సవం సన్నాహక సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం ట్రస్ట్, పెన్షనర్స్ సంఘం సంయుక్తంగా చిల్డ్రన్స్ డే సందర్భంగా ఇందూరు బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానికి సంబంధించి సన్నాహక సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు రెడ్ క్రాస్ సొసైటీ భవనం ఖలీల్ వాడి లో నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, ప్రధాన కార్యదర్శి నర్రా రామారావు, కోశాధికారి కే రామ్మోహన్రావు ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ పాత మండల పరిధిలోని మండలాల్లోగల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలోని విద్యార్థులకు వివిధ విద్య సంబంధిత అంశాలలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వారందరితో బాలోత్సవవ ాతరను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఫోన్ కొంటానని టోకరా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోన్ కొంటానని నమ్మబలకిన ఓ వ్యక్తి తీసుకొని వెళ్ళిపోయిన ఘటన నగరంలో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్ పేరిట ఓ వ్యక్తి సెల్ ఫోన్ షాప్ కు ఫోన్ చేశాడు. జీజీహెచ్కు ఫోన్, పవర్ బ్యాంక్, ఇయర్ బర్డ్స్ తెస్తే తీసుకుంటానని చెప్పి నమ్మబలిగాడు. దీంతో షాప్ యజమాని ఆస్పత్రికి రూ.90 వేల విలువైన ఫోన్, పవర్ బ్యాంక్, ఇయర్ బర్డ్స్ పంపించాడు. సదరు వ్యక్తి అతనిని సూపరింటెండెంట్ రూమ్ ఎదురుగా కూర్చోబెట్టి సార్కు ఇచ్చి డబ్బులు తీసుకొని వస్తాను అని చెప్పాడు. దీంతో బాధితుడు బయట కూర్చోగా నిందితుడు వాటితో ఆసుపత్రికి వెనుక ఉన్న డోర్ నుండి పరారయ్యాడు. దీనిపై బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఒకటవ టౌన్ పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకునే ఆసుపత్రిలో గల సీసీ కెమెరా ఫుటేజ్‌ను చూశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్ బాబు శుక్రవారం తెలిపారు.

నగరంలో స్వచ్ఛతా హీ సేవా



తడిచెత్త, పొడిచెత్తను వేరుచేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరపాలక సంస్థ పరిధిలో మున్సిపల్ కమిషనర్ మకరంద్ నేతృత్వంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొని స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. నగరంలోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ మైదానంలో స్వచ్ఛత హీవా కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ నెంబర్ 28లో, డివిజన్ నెంబర్ 42, డివిజన్ నంబర్ 21, డివిజన్ నెంబర్ 44 బ్యాంక్ కాలనీతో పలు ప్రాంతాలలోని పార్కులలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత, మహిళలు, రెసిడెన్షియల్ కాలనీల ప్రజలు, ప్రజాప్రతినిధుల శ్రమదానాలు, పార్కుల పరిశుభ్రత, తడిచెత్త నుంచి కంపోస్టు తయారీ, పొడి చెత్తను రీసైక్లింగ్ విధానంలో పునర్వియోగం తదితర కార్యక్రమాలు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కార్యక్రమాలలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నికలకు హాజరుకావాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఈనెల 22న జరిగే ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం వివిధ స్థాయిల నూతన కమిటీల ఎన్నికలకు హాజరుకావాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు తెలిపారు. పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 22న ఆదివారం ఉదయం 11 గంటలకు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పద్మారావు ఆధ్వర్యంలో నూతన డివిజన్ కమిటీ, మండల కమిటీ, పట్టణ కమిటీ కొరకు ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అన్నీ వర్గాల అంబేద్కర్ వాదులు సకాలంలో హాజరై ఈ ఎన్నికలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వివిధ మండలాల నుండి వచ్చే వారి కోసం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల కిషన్, నరేష్, ప్రభు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో

నవతెలంగాణ-గాంధారి

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన దేశ భక్తి పాటల పోటీలలో గెలుపొందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి రాజు ప్రశంసాపత్రాలను శుక్రవారం అందజేశారు. విద్యార్థులు పాడిన దేశభక్తి పాటలు విని ఆనందపరవశులయ్యారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. చక్కని దేశ భక్తి గేయాన్ని ఆలపించిన మేఘన, బ్లెస్సి, నిస్సి, రమ్య అక్షయ, పూజ, భాగ్యశ్రీ, శృతిక, ప్రియ అశ్విని, త్రిపుర, స్నేహ, స్ఫూర్తి, కవిత, రశిక, వైష్ణవికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌గౌడ్, పాటల ఇంచార్జ్ బాల్‌రెడ్డి, రాజ పండిట్, మల్లేష్, చిరంజీవి మన్సూర్, చక్రధర్, రాధాదేవి, శ్రీదేవి, వనజ, శరణ్య, మనోహర్, జ్ఞానేశ్వర్, లక్ష్మి నర్సయ్య, వాణి, నాగలక్ష్మి, సాయిలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఈనెల 28న ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించే లోక్ అదాలత్‌ను ఎల్లారెడ్డి మండలంలోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సమస్యలను సత్వరంగా పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్, వివాహ తగాదాలు, కుటుంబ కలహాలు, సరిహద్దు వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, చిట్ ఫండ్స్ మోసాలు, దొమ్మీ కేసులు లోక్ అదాలత్ వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా విముక్తి చెందాలంటే లోక్ అదాలత్‌లో రాజీమార్గం ఎంచుకోవడం ఉత్తమమని సూచించారు. కక్షిదారులు రాజీ కుదుర్చుకొని ఎల్లారెడ్డిని నేర రహిత మండలంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. రాజీ చేయదగిన కేసులలో పోలీసు అధికారులు, పెద్దల సమక్షంలో మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని, ఇరువురి మధ్య సఖ్యత పెంచుకుని ఎటువంటి ఆందోళన లేకుండా సంతోషంగా జీవించాలన్నారు.

బహిరంగంగా కల్తీ కోవా విక్రయాలు

- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం
- స్థానికులు పట్టుకొని మున్సిపల్‌లో అప్పగింత

నవతెలంగాణ-కంఠేశ్వర్

అక్రమ ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు కల్తీ పదార్థాల విక్రయాలకు తెరలేపుతున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బహిరంగంగా కల్తీ కోవా విక్రయాలు జరుపుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్న కల్తీ పదార్థ విక్రయాలు నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయం ముందే విక్రయిస్తున్న సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. గత కొంతకాలంగా నిజామాబాద్ నగరంలో రోడ్లపై తిరుగుతూ నకిలీ కోవాను బన్‌కు అంటించి ప్రజలకు విక్రయిస్తున్నారు. అయితే అనుమానం వచ్చిన స్థానిక ప్రజలు ఆ బండి వ్యక్తిని నిలదీశారు. ఓ వ్యక్తి తన పిల్లలకు కోవా, బన్ వినిపించడంతో వాంతులు విరేచనాలు అయ్యాయి. దీంతో ఈ వ్యాన్‌ను మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి అప్పగించారు. మున్సిపల్ సిబ్బంది, ఆహార కల్తీ నియంత్రణ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆహార కల్తీ నియంత్రణ శాఖ సిబ్బంది శాంపిల్స్ సేకరించారు. కర్నూలు నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్నట్లు వ్యాన్ నిర్వాహకులు చెప్పారు. ఇందులో కోవా లేదని శక్కరి, రవ్వ, డాల్డా కదుపుతున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలో యధేచ్ఛగా నకిలీ తినే పదార్థాలు అమ్ముతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కార్పొరేషన్ పరిధిలో 20 రూపాయల తై-బజార్ కట్టి ఏమైనా అమ్ముకునే అవకాశం ఉన్నట్లు ఉంది పరిస్థితి. అడిగే వారు ఉండరు, పట్టించుకునే వారు ఉండరు. ప్రజలు కోవా అని నమ్మి తిన్నారంటే ఆసుపత్రి పాలవడం ఖాయం. వినియోగదారులు జాగృతం కావడం అవసరం. ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు నెల నెల జీతాలు తీసుకునేందుకే తప్ప కార్యాలయం గడప దాటిన దాఖలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రముఖ హోటళ్లు చిన్నాచితక హోటల్లు అనే తేడా లేకుండా ఎక్కడికక్కడ ఆహార పదార్థాలన్నీ కల్తీ అవుతున్న ఆహార కల్తీ నియంత్రణ శాఖ మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిజామాబాద్ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించారని నిజామాబాద్ ట్రాఫిక్ సీఐ వీరయ్య శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ నగరంలోని వాహనాల తనిఖీలు నిర్వహించగా తాగి బైకు నడుపుతుండగా పట్టుకున్న ఒకరికి ట్రాఫిక్ సీఐ వీరయ్య పట్టుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం శుక్రవారం నగరంలోని మార్నింగ్ కోర్టులో హాజరుపర్చారు. కాగా మేజిస్ట్రేట్ అహ్మద్ మోహియుద్దీన్ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ట్రాఫిక్ సీఐ వీరయ్య తెలియజేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని జిల్లాలో బీసీ డిక్లరేషన్ సభలో వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి నేటికీ అమలు చేయలేకపోతున్నారని అన్నారు. రానున్న మున్సిపల్, గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక ఎన్నికలకు ఈ సవరణ చేసి 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీలు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. బీసీ విద్యార్థులకు ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ 4500 కోట్లు బకాయి ఉందని, దానిని వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసి బీసీ విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని అన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగంధుల మురళీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి అమంద్ ప్రవీణ్ కుమార్, జిల్లా నాయకుడు కుర్లేం శివ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్‌యు స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయండి

- నగరంలో భారీ విద్యార్థి ప్రదర్శన



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) 50 వసంతాల స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు విద్యార్థి ప్రదర్శన పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. కామ్రేడ్ జార్జిరెడ్డి, జేసీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్, రంగవల్లి, చేరాలు లాంటి విద్యార్థి అమరవీరుల త్యాగాల పునాదులపై పిడిఎస్‌యు ఉద్యమం నిర్మాణమైందన్నారు. ఈ సభలను విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రగతిశీల శక్తులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు అనిల్, నాయకులు మహిపాల్, నసీర్, మమత, మంగ, శివకుమార్, సృజన్, నాగేష్, రాజేష్, బబిత్, ప్రవీణ్, జంపన్న, రాజేశ్వర్, ప్రవళిక, స్వేచ్ఛ, సంగీత, ప్రవీణ్, సురేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే పరిశీలన



పరిశుభ్రత గురించి వివరిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపడుతున్న చర్యలను ఆయన తనిఖీ చేశారు. పనికి రాని టైర్లు, బకెట్లలో, ఖాళీ కొబ్బరి బొండాలలో నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి కుండిలను, పూల కుండీలను శుభ్రంగా ఉంచుకోవాలని, పనికి రాని వస్తువులను పాడవేయలన్నారు. కూలరులో ఉన్న నీళ్లను తీసివేసి శుభ్రంగా చేసి ఉంచుకోవాలన్నారు. లేదంటే వీటన్నింటి వలన రోజుల తరబడి నిల్వ ఉన్న నీటిలో లార్వా, దోమలు వృద్ధి చెంది ఆరోగ్యానికి హాని చేస్తాయని వివరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుంద న్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో వర్షం నీరు నిలిచిన గుంతల్లో, మురికి కాలువల వెంట దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం మమత, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలి

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రంగారావు

నవతెలంగాణ-లింగంపేట్

రైతులకు ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో మండల స్థాయి రైతుల సమావేశానికి అయిన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీలు వేరైనా రైతులంతా ఒకటేనని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. రైతు భరోసా రైతులకు కౌలు రైతులకు ఎకరానికి రూ.15000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12,000 ఇవ్వాలన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మూతపడిన చక్కెర కర్మాగారాలను వెంటనే తెరిపించాలని కోరారు. వచ్చేనెల 5వ తేదీన కామారెడ్డిలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులు అంజన్న, ఆనందరావు, రాష్ట్ర విద్యుత్ వినియోగదరుల ఫోరం కార్యవర్గ సభ్యులు, భారతీయ కిసాన్ సంఘం డివిజన్ కార్యదర్శి రాజాగౌడ్, మండలాధ్యక్షుడు ఆకుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంగ్ మండలాధ్యక్షులుగా సాయిరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షునిగా మోతే గ్రామానికి చెందిన ఎల్లాల సాయిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి రైతుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎందుకున్నారు. అధ్యక్షులుగా ఎల్లాల సాయిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆకుల బాలరాజు, కార్యదర్శిగా వెంకట్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా దర్శనం గోపాల్, లక్ష్మారెడ్డి, కాంత్‌రెడ్డి, భద్రపరాజు, రావుల శ్రీనివాస్, దయాకర్, సాయిలు, వజీర్, రాజేశ్వరరావు, పోచయ్య, రాజు, 20 మంది కార్యవర్గ సభ్యులను అనంతరం వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రాజాగౌడ్, ఆకుల రాజయ్య, జిల్లా నాయకులు తదితరులున్నారు.

28న జాతీయ లోక్ అదాలత్

- జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి



నవతెలంగాణ-ఆర్మూర్

రాజి మార్గమే రాజమార్గం అని, జాతీయ లోకదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి సూచించారు. పట్టణ కోర్ట్ ఆవరణలో ఈ నెల 28 న నిర్వహించనున్న జాతీయ లోకదాలత్ పై శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించరు. ఈ సందర్బంగా మాట్లాడుతు రాజి మార్గమే రాజా మార్గమని, కక్షి దారులు కోర్టుల చుట్టూ తిరుగకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకొవాలన్నారు. ఇరు పక్షాలు కేసులు రాజీ చేసుకోవాడానికి జాతీయ లోకదాలత్ ను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డిఓ రాజా గౌడ్,ఏసీపీ బస్వారెడ్డి, అడిషనల్ పిపి రామకృష్ణ,సీఐ లు రవి కుమార్, శ్రీధర్ రెడ్డి,నవీన్ కుమార్,అన్ని పోలిస్ స్టేషన్ ల ఎస్ఐ లు,కోర్ట్ సిబ్బంది,కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు , కోర్ట్ కానిస్టేబుల్ లు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై మొక్కజొన్న ఆరబెటొద్దు

- ఎస్ఐ బి.నరేష్

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని రహదారులపై మొక్కజొన్న ఆరబెటొద్దని ఎస్ఐ బి.నరేష్ హెచ్చరించారు. రహదారులపై మొక్కజొన్న ఆరబోయడం ద్వారా వాహనదారులు రోడ్డు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, రోడ్డు ప్రమాదాల దృశ్య రైతులు రహదారులపై మొక్కజొన్న ఆర బోయొద్దని ఎస్ఐ తెలిపారు.

వరిలో సుడిదోమ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో సన్న రకం వరి పొలాల్లో సుడిదోమను గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారిణి రమ్యశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్లూర్, చౌట్‌పల్లి, బషీరాబాద్, కమ్మర్‌పల్లి, నర్సాపూర్, కోన సముందర్ గ్రామాల్లో వరి పంట క్షేత్రాలను వ్యవసాయ అధికారిణి రమ్యశ్రీ, ఏఈఓలతో కలిసి సందర్శించి పరిశీలించారు. సుడిదోమ నుండి వరి పొలాలను కాపాడుకునే చర్యల్లో భాగంగా మొదట వరి పొలాల్లో నుంచి నీటిని తీసివేసి ఆరబెట్టుకోవాలని ఆమె సూచించారు. ప్రతి రెండు మీటర్లకు తూర్పు, పడమర దిశగా పాయలు తీసుకోవాలన్నారు. సుడిదోమను గుర్తించిన తొలి దశలో (గుడ్ల దశ) వేప నూనె 1500 పిపిఎం 5 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలుపుకొని వరి పొలంలో పిచికారి చేయాలన్నారు. తర్వాత దశలో ట్రైఫ్లు మీజోపైరిమ్ అనే పురుగు మందును ఎకరానికి 94 మిల్లీ లీటర్లు పిచికారి చేసుకోవాలని తెలిపారు. వరి పొలం పొట్ట దశలో యూరియా తోపాటు పొటాష్ కూడా కలిపి వేసుకుంటే మొక్క రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రమేష్, సాయిరాం రాజు, పద్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలు సరిచేసిన అధికారులు

- వెంటనే స్పందించినందుకు గ్రామస్తుల అభినందనలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానాకుర్ది గ్రామంలోని హనుమాన్ టెంపుల్ ముందట చాలా రోజుల నుంచి వైరు తీగలు కిందికి జారుతున్నాయి. దీని గమనించి గ్రామస్తులు శుక్రవారం ఎలక్ట్రిసిటీ ఏఈ బాబా శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సమస్యను తీర్చే ప్రయత్నం చేశారు. అలాగే గ్రామంలో వైర్ల కింద కొమ్మలు ఏటవాలుగా పెరగడం వల్ల కూడా కరెంటు తీగలకు తలగడం వల్ల తరచూ కరెంటు సమస్య వస్తుంది. వెంటనే కొమ్మలను తీసివేయించి విద్యుత్ సరఫరాను అంతరాయం లేకుండా చూశారు. ఆయన పనితీరుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ జాబితా అభ్యంతరాలకు నేడు గడువు

నవతెలంగాణ-రామారెడ్డి

ఓటరు జాబితాను ఆయా గ్రామాల గ్రామపంచాయతీల్లో అందించడం జరిగిందని, ఓటర్ జాబితాలో అభ్యంతరా లుంటే పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు ఇవ్వడానికి శనివారం చివరి రోజు అని ఎంపిడిఓ తిరుపతి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.